క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



జగ్గయ్యపేట: రామ్‌కో సిమెంట్స్ కర్మాగారం వ్యవస్థాపకుడు రామసుబ్రహ్మణ్య రాజా జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్‌కో సిమెంట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మూర్తి, అడ్మిన్ ఫరూక్‌అహ్మద్, హెచ్‌ఆర్ రామకృష్ణసాయి, వైద్యుడు రాజా కేశవప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



కంచికచర్ల: భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలని జిల్లా వనరుల కేంద్రం విజయవాడ వ్యవసాయ సంచాలకులు మోనీషా సూచించారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మోనీషా మాట్లాడుతూ సాగుచేసే సమయంలో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. వరి విత్తనాలు పొలంలో చల్లడంతో వ్యవసాయానికి తక్కువ పెట్టుబడి సరిపోతుందన్నారు. చీడపీడల నివారణ, పురుగుమందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నందిగామ వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ ఐకే శ్రీనివాస్, కంచికచర్ల మండల వ్యవసాయ అధికారి కె. విజయకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్, హనీష్, సాయితేజ, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



నందిగామ: విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య కోరారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.వి.ఎస్.ఎన్ బెనర్జీ ఆధ్వర్యంలో గురువారం నందిగామ మండలంలోని పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీవోనంబరు 117ను రద్దు చేసి పాఠశాలల విలీనాన్ని నిలుపుదల చేయాలని కోరారు. ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం స్నేహపూర్వకంగా వ్యవహరించడంతోపాటు ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు. డీఎస్సీ కంటే ముందుగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బి.రమణయ్య, చిన్నం నరసింహారావు, కె.లక్ష్మీనారాయణ, యలమందయ్య, స్వామి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

ఈశ్వరప్రసాద్ రిమాండ్‌కు నిరాకరణ

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ 13వ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరి ఈశ్వరప్రసాద్‌ను పటమట పోలీసులు అరెస్ట్ చేశారు. 2022లో పటమట లంక కొమ్మా సీతారామయ్య స్కూల్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల వ్యవహారంలో వైఎస్సార్ సీపీ–టీడీపీ నాయకులు మధ్య వివాదం తలెత్తింది. టీడీపీ 9వ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరి ఈశ్వర్‌ప్రసాద్‌ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో చెన్నుపాటి గాంధీ కంటికి తీవ్రంగా గాయమవ్వగా ఆయన పటమట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో ఈశ్వరప్రసాద్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి పటమట పోలీసులు ఈశ్వరప్రసాద్‌ను అరెస్ట్ చేసి నగరంలోని 4వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచారు. దీనిపై ఈశ్వర ప్రసాద్‌ను రిమాండ్‌కు పంపాలని పోలీసులు కోరగా జడ్జి రిమాండ్‌ను నిరాకరించారు. నాటి ఎఫ్ఐఆర్‌లో 326, 506 సెక్షన్లకు తోడు ఇప్పుడు 307, 120బి సెక్షన్లు ఎలా నమోదు చేస్తారని న్యాయమూర్తి పోలీసులను వివరణ కోరారు. దీనికి పోలీసులు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. దీంతో పోలీసులను మందలించి ఈశ్వరప్రసాద్‌కు బెయిల్ మంజూరు చేశారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గురువారం జగ్గంపేటకు చెందిన శ్రీ సీతారత్న లలిత కళా నృత్య నికేతన్‌కు చెందిన కళాబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో నీరాజనాలు అర్పించారు. జగ్గంపేటకు చెందిన ముళ్ళపూడి విజయలక్ష్మి కళాబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై ఈ నృత్య ప్రదర్శన నిర్వహించగా భక్తులు వీక్షించి ముగ్ధులయ్యారు.

గణనీయంగా పెరిగిన పత్తిసాగు

- తక్కువ పెట్టుబడి..ఎక్కువ ఆదాయం
- గిట్టుబాటు ధర లభిస్తున్న వైనం
- రెండోపంటగా మొక్కజొన్నకు అవకాశం
- ఈ ఏడాది నియోజకవర్గంలో 20వేల ఎకరాల్లో పత్తిసాగు



వత్సవాయిలో సాగవుతున్న పత్తిపంట

వత్సవాయి: ఈ ఖరీఫ్ సీజన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో పత్తిసాగు గణనీయంగా పెరిగింది. పత్తి విత్తనాలు నాటి ఇప్పటికే ఇరవై రోజులు కావస్తుంది. గతేడాది నియోజకవర్గంలో వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాల్లో కలిపి మొత్తం 15వేల ఎకరాలలో పత్తి పంట సాగుచేయగా, ఈ ఏడాది 20వేల ఎకరాలకు చేరుకుంటుందని వ్యవయాసాధికారులు అంచనా వేస్తున్నారు. మిర్చిపంటను సగానికి సగం తగ్గించారు. గత సీజన్‌లో మిర్చి రైతులు తక్కువ దిగుబడులు, నిలకడలేని ధరలతో తీవ్రంగా నష్టపోవడంతో మిర్చిపంట వేయడానికి రైతులు అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో తక్కువ పెట్టుబడితో సాగుచేసే పత్తి పంటపై రైతులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. అంతేకాకుండా గడచిన రెండు మూడేళ్ల నుంచి పత్తికి ఆశించిన స్థాయిలో ధరలు ఉంటుండటంతో రైతులు ఈపంట సాగుకు మొగ్గుచూపుతున్నారు. పత్తి క్వింటా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.7వేలకు పైగా పలుకుతుండగా, అధిక పెట్టుబడులతోపాటు నిలకడలేని ధరలు ఉన్న మిర్చి పంట సాగుచేసేకంటే పత్తి పంట సాగు మేలని రైతులు భావిస్తున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా రైతులు పత్తిపంట వైపు మొగ్గు చూపుతుండటంతో గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో పత్తిసాగు గణనీయంగా పెరుగుతోంది. రహదారుల పక్కన ఎక్కడ చూసినా పత్తి సాగుచేసిన పొలాలే కనిపిస్తున్నాయి. గత సీజన్ కంటే పత్తిసాగు విస్తీర్ణం ఈసారి సుమారు 5వేల ఎకరాల పైచిలుకు పెరిగినట్లు మండల వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటగా పత్తి...



ఏటా మిర్చి పంటను ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్లు, వైరస్‌లతో నష్టాలే మిగులుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయ పంటగా పత్తిసాగుకు మొగ్గుచూపాం. నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేపట్టాను. తక్కువ పెట్టుబడితోపాటు రెండోపంటగా మొక్కజొన్నతోపాటు మరో పంటను సాగుచేసుకునే వీలుండటంతో రైతులంతా పత్తిసాగుకు మొగ్గుచూపుతున్నారు. పత్తికి మంచి ధర కూడా లభిస్తుండటంతో గతంలో కంటే ఈసారి పత్తిసాగు చేపట్టే రైతుల సంఖ్య పెరిగింది.

–చావా కృష్ణారావు, ఇందుగపల్లి

సస్యరక్షణపై రైతులు దృష్టిసారించాలి..



పత్తి నాటిన నలభై రోజుల నుంచి రైతులు సస్యరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వాడరాదని సూచించారు. అధిక వర్షాలు కురిసి పత్తి పొలాల్లో నీరు నిలిచినప్పుడు కాలువలు ద్వారా నీరు బయటకు వచ్చేవిధంగా చూడాలని తెలిపారు. తేమ ఎక్కువగా ఉంటే ఎకరానికి ఒక బస్తా యూరియా చల్లాలి. పత్తి అధిక నీటి సాంద్రతను తట్టుకోలేదనే రైతులు ఈ విషయాన్ని గమనించి చర్యలు చేపట్టాలన్నారు.

–వి రవికుమార్, వ్యవసాయాధికారి

‘అల్లూరి’ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం



నందిగామలో ‘అల్లూరి’కి నివాళులర్పిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు, ఉద్యోగులు



పెనుగంచిప్రోలులో అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న గాంధీ, సాయిహర్ష తదితరులు



కంచికచర్లలో ‘అల్లూరి’కి నివాళులర్పిస్తున్న రామచంద్రుడు, ఉద్యోగులు, పాఠకులు

నందిగామ: రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు చూపిన ధైర్య సాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకమని బళ్ళారి రాఘవ కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బబ్బెల్లపాటి గోపాలకృష్ణ సాయి పేర్కొన్నారు. నందిగామ పట్టణంలో గురువారం బళ్లారి రాఘవ కళాసమితి ఆధ్వర్యంలో విప్లవ వీరుడు సీతారామరాజు 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశం కోసం బ్రిటీష్ వారితో అలుపెరుగని పోరాటం సాగించి, ప్రాణాలర్పించిన ధైర్యశాలి అల్లూరి అని కొనియాడారు.

రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో..

స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఆర్డీవో ఎ. రవీంద్రరావు, కార్యాలయ ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి సేవలను కొనియాడారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి అందరికీ ఆదర్శనీయమని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అల్లూరి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఎంపీడీవో సాయిహర్ష, మండల పరిషత్ కార్యాలయ ఏవో సిద్ధారెడ్డి, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ భానుప్రసాద్, ఏఎస్‌డబ్ల్యూవో గణేష్‌బాబు, ఎస్సీ హాస్టల్ వార్డెన్ స్వామి, సుబ్బాయిగూడెం ఉపసర్పంచి పూర్ణయ్య పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు, పాఠకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా అల్లూరు రామచంద్రుడు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారితో అల్లూరి సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం గొప్ప అధ్యాయమని కొనియాడారు. రిటైర్డ్ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, ఆవుల పేరయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సంపూర్ణ అభియాన్ ఉత్సవ్ కార్యక్రమం

పెనుగంచిప్రోలు: ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రాధాకృష్ణ కల్యాణ మండపం ఆవరణలో ఉదయం 10 గంటలకు సంపూర్ణత అభియాన్ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాయిహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జి.సృజన, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ హాజరవుతారని వివరించారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

కొణిజేటికి నివాళులు

జగ్గయ్యపేట అర్బన్: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలోని రోశయ్య, స్వామి వివేకానంద విగ్రహాలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం : సీఐటీయూ

నందిగామ: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణ కార్మికులను రాజకీయ కారణాలతో తొలగిస్తే ఉద్యమిస్తామని సిఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ తెలిపారు. మండలంలోని రాఘవాపురం మధ్యాహ్న భోజన ఏజెన్సీని గోపాల్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా చోట్ల మధ్యాహ్న భోజన కార్మికులు స్వచ్ఛందంగా వైదొలగాలని రాజకీయంగా ఒత్తిడి చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను ఇబ్బందులు పెట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులను ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బందులు పెట్టి తొలగించాలని చూస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వంగవీటి రంగాకు ఘననివాళి



కంచికచర్లలో రంగాకు నివాళులర్పిస్తున్న మిత్రమండలి సభ్యులు



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి రఘురాం, ఎమ్మెల్యే తాతయ్య తదితరులు



కేక్ కట్‌చేస్తున్న కాపు నాయకులు

కంచికచర్ల: స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో గురువారం రాధా–రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతిని నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు ఉప్పు స్వామి మాట్లాడుతూ పేదలకు న్యాయం చేయాలనే తలంపుతో నిరాహారదీక్ష చేపట్టిన రంగాను కొంతమంది టీడీపీ గూండాలు పొట్టనపెట్టుకున్నారని పేర్కొన్నారు. బచ్చు వెంకటేశ్వరరావు, చాపా సత్యనారాయణ, దేవిరెడ్డి విఘ్నేశ్వరరావు, యర్రంశెట్టి బాలయ్య బడేటి మల్లి, తుపాకుల రవి, అప్పన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: ఆఖరిక్షణాల్లో కూడా ప్రజల కోసం పోరాడుతూ ప్రాణాలు విడిచిన మహోన్నత వ్యక్తి వంగవీటి రంగా అని మాజీమంత్రి నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. కాపు వారధి టీం, అఖిలభారత కాపు సమైక్య సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రంగా జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక కోదాడ రోడ్‌లోని రంగా విగ్రహానికి రఘురాం, శ్రీరాం తాతయ్య పూలమాలలువేసి నివాళులర్పించారు. పట్టణంలో కాపు కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

రంగా అభిమానుల ఆధ్వర్యంలో...

రంగా అభిమాన సంఘం నాయకులు వంగవీటి రంగాకు నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు సామినేని బాబ్జినాయుడు, ముత్యాల వెంకట శ్రీనివాసరావు,సిరివెళ్ల శ్రీనివాసరావు, కుప్పాల శ్రీనివాసరావు, రామారావు కోదాడ రోడ్‌లోని రంగా విగ్రహానికి గజమాలవేసి నివాళులర్పించారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: వంగవీటి రంగా జయంతిని పెనుగంచిప్రోలులో గురువారం నిర్వహించారు. తూర్పుబజారు వినాయకుడి గుడివద్ద వీఎంఆర్ రంగా యూత్ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. రంగిశెట్టి బాబు, యర్రంశెట్టి నాగబాబు, నరెడ్ల కిషోర్, యనమదల నరసింహారావు, చెక్కా రమణ, సత్యనారాయణ, శ్రీనివాసరావు, తిరుపతిరావు, సుధీర్ పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: పెద్దాపురం, నరసింహారావుపాలెం, జుజ్జూరు తదితర గ్రామాల్లో వంగవీటి రంగా జయంతిని నిర్వహించారు. రంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు బొమ్మిశెట్టి దుర్గాదేవి, రమావత్ కోటి, పూలా రాంబాబు, బొమ్మిశెట్టి భాస్కరరావు, రాము, పూలా పూర్ణ, పుల్లయ్య పాల్గొన్నారు.

రంగా విగ్రహం ఆవిష్కరణ



రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉదయభాను

పోచంపల్లి(జగ్గయ్యపేట): వంగవీటి మోహన రంగ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను కొనియాడారు. వంగవీటి రంగా జయంతిని పురస్కరించుకుని పోచంపల్లి మంలో అభిమానులు ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ కులమతాలకతీతంగా పేద ప్రజల అభివృద్ధికి రంగా విశేషంగా కృషి చేశారన్నారు.

పేదల ఇళ్ల పట్టాల కోసం దీక్షకు కూర్చున్న రంగాను దారుణంగా హతమార్చారని గుర్తు చేశారు. అంతకుముందు గ్రామంలో రంగా అభిమానుల ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వట్టెం మనోహర్, రంగా అభిమానులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం



పేటలో విద్యార్థులను బయటికి పంపించి పాఠశాలను మూసివేయిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. బంద్ నేపథ్యంలో పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లానాయకులు మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్షలో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, ఈ ఏడుగురు అభ్యర్థులకు కూడా 720/720 మార్కులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. నీట్ పరీక్షపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్య కేంద్రీకరణలో భాగంగా నీట్ పరీక్షను తీసుకువచ్చి విద్యను ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. దేశం మొత్తం ఒకే పరీక్ష ఉండాలని విద్యార్థులపై ఒత్తిడి పెంచిందన్నారు. ఇది పూర్తిగా రాష్ట్రాల హక్కులను కాలరాయడమేనన్నారు. ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షలన్నింటిపై విచారణ చేయాలని, పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందినందున ఈఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి బకాయిలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. జీవోనంబరు 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు షేక్ రిహాన్, షేక్ రేహమత్, బాలు, తేజ, రవి తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు చర్యలు : డీఎంహెచ్‌వో



ప్రభుత్వాస్పత్రిలో పేషంట్లను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని, మోతిబాబు, వైద్యులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా దాదాపుగా తగ్గుముఖం పట్టింది. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట నుంచి ఓ వ్యక్తి, పేట పట్టణంలోని చెరువుబజారు ప్రాంతానికి చెందిన మరోవ్యక్తి గురువారం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో ఏడుగురు డయేరియా బాధితులు చికిత్సపొందుతున్నారు .వారి పరిస్థితి నిలకడగానే ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. పేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, వత్సవాయి మండలంలోని మక్కపేట గ్రామాల్లో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయని వివరించారు. పంచాయతీ, మున్సిపాలిటీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో డయేరియా నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించేందుకు మున్సిపల్, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. క్లోరిన్ టాబ్లెట్లు వినియోగించే విధానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వారం రోజుల్లో డయేరియా కేసులు పూర్తిగా తగ్గిపోతాయని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వోతోపాటు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు ఆస్పత్రిలోని డయేరియా బాధితులను పరామర్శించారు.పేట సీహెచ్‌సీ సూపరిండెంట్ డాక్టర్ ఎ.హరీష్, పేట పీపీ యూనిట్, బూచవరం వైద్యాధికారులు, వైద్యులు అనిల్‌కుమార్, వాసంతి, విద్యాసాగర్, పవన్, సమీర, సునిల్, మూడు మండలాల పీహెచ్‌సీల వైద్యబృందం పాల్గొన్నారు.

‘నీట్’పై సమగ్ర విచారణకు డిమాండ్



బంద్ నేపథ్యంలో పాఠశాలలు మూసివేయిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

నందిగామ: నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలికి నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం బంద్ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నందిగామ పట్టణంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేశారు. పలుచోట్ల తెరిచిన పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు మూసివేయించారు. ఈసందర్భంగా గోపి నాయక్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో బంద్ విజయవంతమైందని తెలిపారు. నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగినందున ఈ పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధరిదాస్



నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఈ సైక్లోథాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మత్తు పదార్థాల వాడకాన్ని యువకులు తగ్గించాలని కోరుతూ విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధరిదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఇందిరా పార్క్ ఈట్ స్ట్రీట్ నుంచి ఏలూరురోడ్డు, కంట్రోల్‌రూం, బస్‌స్టేషన్ మీదుగా జగన్నాథ్ మందిరానికి ర్యాలీ చేరింది. చక్రధరిదాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపు నిచ్చారు. మత్తు పదార్థాలను సేవించడం వల్ల అనారోగ్యానికి గురవుతారని, తద్వారా ఎందుకూ పనికి రాకుండా ఉంటారన్నారు. యువత వచ్చే తరానికి మార్గదర్శకులుగా ఉండాలన్నారు. ఈ ఏడాది జగన్నాథ రథయాత్రలో భాగంగా యునైటెడ్ అగెనెస్ట్ అడిక్షన్ అనే అంశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర పీఆర్‌ఓ శ్యామ్ సుందర అచ్యుత దాస్, బలరాం గోవింద్‌దాస్, మాధవ సేవాదాస్, వజ్రందాస్, విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఎం ఫార్మసీ విద్యార్థులు అంతర్జాతీయ ఫార్మసీ సదస్సులో ప్రతిభ చూపినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత తెలిపారు. వైద్య విధానాల్లో నూతన మార్పులపై నిర్వహించిన సదస్సులో జె.మణి నితీష్ ప్రదర్శించిన పరిశోధనా పత్రానికి ప్రథమ బహుమతి పొందగా, వైద్య రంగంలో భవిష్యత్తు అవసరాలు అనే అంశంపై ఎం ఫార్మసీ విద్యార్థుల ఓరల్ ప్రజెంటేషన్‌లో జి.ఇందుశ్రీ ప్రథమ బహుమతి, జె.మణి నితీష్ ద్వితీయ బహుమతి, ఈ పోస్టర్ విభాగంలో కె.నటరాజ్ ద్వితీయ బహుమతి, జి. మేరీగ్రేస్ తృతీయ బహుమతిని సాధించడం గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ప్రతిభచూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు, ఫార్మస్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.రమణ అభినందనలు తెలిపారు.

● దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద గురువారం దక్షిణామూర్తికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కెఎస్.రామరావు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.